ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించాలి

లాలాపేట: కేబినెట్ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించాలని తెలంగాణ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాసిన వినతి పత్రాన్ని గురువారం సీఎంఓలో అందజేశామన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ గత ఎన్నిక మేనిఫెస్టోలో ప్రకటించిన ఆర్టీసీకి సంబంధించిన అంశాలన్నింటిని పరిష్కరించాలన్నారు. బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణంలో ఆధార్ కార్డుతో కండక్టర్లకు కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని ప్రత్యేక గుర్తింపు కార్డును అందజేయాలన్నారు.

అవకాశవాద నాయకులను దూరం పెట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: అవకాశవాదంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓయూ పూర్వ విద్యార్థి నాయకులను నామినేటెడ్ పదవులకు దూరం పెట్టాలని ఓయూ జేఏసీ నేతలు భీమ్‌రావ్ నాయక్, ప్రతాప్‌రెడ్డి, పూసల రమేష్, రమేష్ రాథోడ్ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. ఓయూ పూర్వ విద్యార్థి నాయకుల్లో కొందరు గతంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో కొనసాగుతూ రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలను విమర్శించి నేడు పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌లో చేరారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమి కోసం ప్రచారం చేసిన ఓయూ పూర్వ విద్యార్థి నేతలు నేడు పార్టీలో చేరి పదవులను ఆశించడం సిగ్గుచేటన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. డివిజన్ పరిధిలోని మైలార్‌గడ్డ, నామాలగుండు తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో గురువారం ఆమె మాట్లాడి పలు సలహాలు, సూచనలు చేశారు. కాలనీలు, బస్తీలతోపాటు ప్రధాన, అంతర్గత రహదారులపై చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు.

ఘనంగా ఈద్-మిలాప్



సనత్‌నగర్: బక్రీద్ సందర్భంగా సనత్‌నగర్‌లోని డీఎస్ఎం కాలనీలో గురువారం సాయంత్రం ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సికిందర్ బాబా ఆధ్వర్యంలో జామా మసీదు జాఫ్రీ సమీపంలో నిర్వహించిన ఈ వేడుకలకు బీజేపీ నాయకులు వెల్లాల రామ్మోహన్, ఏఐఎంఐఎం నాయకులు మహ్మద్ షౌఖత్, జామా మసీదు జాఫ్రీ అధ్యక్షులు సయ్యద్ సుమానుద్దీన్ హాజరై మాట్లాడారు. శాంతిని కోరుకోవడమే సర్వమతాల సారమన్నారు. ఈ కార్యక్రమంలో మీర్జా సమీర్‌బేగ్, మహ్మద్ హమీద్, మహ్మద్ షుకుర్, మహ్మద్ జహీర్ పాషా, ఇసాక్ సాహెబ్, షేక్ అమీర్ నవాజ్, షేక్ సల్మాన్, నవాజ్ మహ్మద్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అరబింద్ కుమార్(27) భార్య మున్నీతో కలిసి మూడేళ్ల క్రితం సంగారెడ్డిలోని సదాశివపేటలో నివాసముంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అరబింద్ కుమార్‌ను బిహార్‌లోని తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు ఈ నెల 19న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అప్పటికే మద్యంమత్తులో ఉన్న అరబింద్‌కుమార్ రైల్వే స్టేషన్‌లో అపస్మారస్థితిలోకి వెళ్లాడు. గమనించిన అతని భార్య వెంటనే పోలీసుల సహాయంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఎక్కడున్నారో.. ఏమయ్యారో?

వేర్వేరు ఘటనల్లో నలుగురి అదృశ్యం



అమరం రవీందర్‌రెడ్డి

సనత్‌నగర్: వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యమైన ఘటన బేగంపేట, లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బేగంపేట ఎస్ఐ గంగాధర్ వివరాల ప్రకారం.. బేగంపేట గగన్‌విహార్ కాలనీలో ఉండే విశ్రాంత రైల్వే ఉద్యోగి అమరం రవీందర్‌రెడ్డి (68) ఈ నెల 10న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, తెలిసిన వారితో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో మహిళ



దేవర శోభ

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ ఎరుకల బస్తీకి చెందిన దేవర శోభ (57) ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త దేవర బాబు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


వైద్యానికి వచ్చిన వ్యక్తి..



నర్సింగ్

అడ్డగుట్ట: మానసిక స్థితి సరిగాలేని ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. లాలాగూడ ఎస్ఐ షాహీద్ పాషా వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌లోని అశోక్ కాలనీకి చెందిన ఇమ్మది నర్సింగ్(49) ఇది వరకు రైల్వే ఉద్యోగి. కొంతకాలంగా మానసికస్థితి సరిగా ఉండకపోవడంతో నర్సింగ్‌ను ఉద్యోగం నుంచి తొలగించి అతని కుమారుడికి ఇచ్చారు. నర్సింగ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం కుటుంబ సభ్యులు ఈ నెల 15న మెట్టుగూడలోని రైల్వే ఆస్పత్రికి తీసుకొచ్చారు. కాసేపటి తర్వాత టిఫిన్ చేసి వస్తానని చెప్పి వెళ్లిన నర్సింగ్ ఎంతకీ రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికి, స్థానికులను వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని..



షీరిన్

అడ్డగుట్ట: ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అదృశ్యమైంది. నార్త్‌లాలాగూడలోని నూరీ పాన్‌షాప్ సమీపంలో నివాసముంటున్న షీరీన్ బేగం(27) నానక్‌రామ్‌గూడలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 18న ఆఫీస్‌లో మీటింగ్ ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన షీరీన్ రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు షీరిన్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

యోగా మార్గం.. ఆరోగ్య భాగ్యం


నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాధకులతో సందడిగా పార్కులు

ఉచిత శిక్షణలకు ఆదరణ



ఇండస్ట్రియల్ పార్కులో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న సాధకులు (ఫైల్)



సనత్‌నగర్: ఉరుకుల పరుగుల జీవితంలో నగరవాసి తన ఆరోగ్యం గురించి ఆలోచించే తీరిక లేకుండా పోతోంది. ఒత్తిడి ఆవహించి ఆరోగ్య రుగ్మతలు దరిచేరే వరకు మేల్కొనలేకపోతున్నారు. తీరా ఆరోగ్య సమస్యలు చుట్టుముడితే గానీ ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచడం లేదు. అప్పుడు వైద్యులు సూచిస్తే తప్ప శారీరక వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. అసలు ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని అందుకు యోగా సరైన మార్గమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. యోగా ప్రాముఖ్యతపై దశాబ్దాలుగా కొన్ని సంస్థలు ప్రచారం చేయడంతో ఉచిత శిక్షణను కూడా అందిస్తున్నాయి. ఉద్యానాల్లోని పచ్చటి బయళ్ల నడుమ యోగా సాధన చేయిస్తూ ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. దీంతో చాలా వరకు పార్కులు ఇప్పుడు యోగా కేంద్రాలుగా మారిపోయాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్కులన్నీ యోగా సాధకులతో సందడిగా కనిపిస్తుంటాయి. ఒకప్పుడు ఒకటి రెండు పార్కులకు మించి యోగా కేంద్రాలు నడిచేవి కావు. ఇప్పుడు యోగాపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. ఏ పార్కు చూసినా యోగా శిక్షణ కేంద్రాలు అవతరించాయి. ఇందుకు పలు సంస్థలు స్వచ్ఛందంగా ఉచితంగా శిక్షణ అందించడమే ఇందుకు కారణం. ఇంటింటా ఆరోగ్యాన్ని నెలకొల్పే లక్ష్యంగా ఆయా సంస్థలు ఎందరికో శిక్షణ ఇస్తున్నాయి. పార్కుల్లో శిక్షణ పొందిన వారే శిక్షకులుగా మారి మరెందరికో ఆరోగ్యదానం చేస్తుండడం విశేషం.

సనత్‌నగర్ పార్కుల్లో ఉచిత శిక్షణ

భారతీయ యోగా సంస్థాన్ ఆరోగ్య భారతాన్ని నెలకొల్పే దిశగా ముందుకు సాగుతోంది. ఐదున్నర దశాబ్దాల క్రితం ప్రారంభమైన శిక్షణ ఇప్పుడు వేలాది మంది ఆరోగ్యదానం చేసే కేంద్రంగా మారింది. నగరవ్యాప్తంగా పదుల సంఖ్యలో సెంటర్ల ద్వారా యోగాసనాలు నేర్పిస్తుండగా సనత్‌నగర్ నియోజకవర్గం విషయానికొస్తే సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కు, వినాయక గ్రౌండ్, బీకేగూడ పార్కు, కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కు, జెక్‌కాలనీ, బేగంపేట మయూరిమార్గ్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో ఉచితంగా యోగ శిక్షణ తరగతులు కొనసాగుతున్నట్లు సంస్థ ప్రతినిధి వర్ధన్ నాయక్ తెలిపారు.

ప్రయోజనాలివే..

- సంపూర్ణ శారీరక సామర్థ్యం
- మానసిక ప్రశాంతత
- రోగ నిరోధకశక్తి మెరుగుదల
- చురుకైన జీవనశైలి
- ఒత్తిడి నుంచి ఉపశమనం
- బరువు తగ్గడం
- వ్యాధులకు దూరం
- సానుకూల దృక్పథం
- రోజంతా ఉత్సాహం
- పర్యావరణంతో మమేకం
- సామాజిక బంధాలు మెరుగు

అమీర్‌పేట నేచర్‌క్యూర్ ప్రాంగణంలో...

అమీర్‌పేట నేచర్‌క్యూర్ ఆస్పత్రి ప్రాంగణంలో గల తెలంగాణ రాష్ట్ర యోగాధ్యాయ పరిషత్ ఆధ్వర్యంలో రోజుకు 500 మందికి పైగా శిక్షణ అందిస్తున్నారు. యోగా థెరపీతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే కేంద్రంగా అవతరించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు ఇక్కడ యోగా థెరపీ తీసుకుని ఉపశమనం పొందుతున్నారు.

నేడు 1000 మందితో యోగా

అమీర్‌పేట: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేమన యోగాధ్యాయన పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం (నేడు) సంజీవయ్య పార్క్‌లో 1000 మందితో యోగా నిర్వహిస్తున్నట్లు కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా, మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరై యోగాసనాలు వేస్తారన్నారు.

యోగా కేంద్రాలుగా పార్కులు, కమ్యూనిటీ హాళ్లు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని అనేక పార్కులు, కమ్యూనిటీహాళ్లలో ప్రతి రోజు ఉచితంగా యోగా చేయిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు యోగాభ్యాసం ద్వారా తమ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు. రోజు రోజుకు పార్కుల్లో యోగా సాధకుల సంఖ్య పెరిగిపోతోంది. సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో ప్రతి రోజు ఉచితంగా యోగా నేర్పిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి 8.30 వరకు ఉచితంగా యోగా సాధనాలు చేయిస్తున్నారు. ఇక్కడ పలువురు గురువులు ఉచితంగా యోగా శిక్షణనిస్తున్నారు. యోగా సాధనలో అనేక మంది అనారోగ్యానికి చెక్ పెట్టారు. మనిషిని పరిపూర్ణ ఆరోగ్యవంతుడిని చేసేదే యోగా అని ప్రముఖ యోగా గురువు వీబీఎస్ గాంధీ చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా.. మానసికంగా..శారీరకంగా బాగున్నప్పుడే సమాజం ప్రగతి పథంలో ప్రయాణిస్తుందని యోగా గురువు క్రిష్ణ యాదవ్ పేర్కొన్నారు.

నేడు పద్మారావునగర్ పార్కులో..

సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించడానికి విస్తతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు వీబీఎస్ గాంధీ, క్రిష్ణ యాదవ్ చెప్పారు. ఉదయం 7 గంటలకు పార్కులో పెద్ద ఎత్తున సామూహిక యోగా అభ్యాసం అనంతరం గురువులకు సత్కార కార్యక్రమం ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్, యోగా సాధకులు అనేక మంది పాల్గొంటారన్నారు.



పద్మారావునగర్ పార్కులో యోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

చిల్డ్రన్స్ ఐ క్లినిక్ ప్రారంభం



క్లినిక్ ప్రారంభోత్సవంలో వైద్య నిపుణులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో నూతనంగా పిల్లల కోసం కంటి క్లినిక్‌ను ప్రారంభించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి భాగస్వామ్యంలో చిల్డ్రన్స్ ఐ క్లినిక్‌ను ప్రారంభించినట్లు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ.. పిల్లలు, నవజాత శిశువుల సమగ్ర కంటి సంరక్షణ కోసం నూతన ఐ క్లినిక్ ఎంతో దోహదపడుతుందన్నారు. మెరుగైన వైద్య విధానంతో తమ సిబ్బంది రోగులకు సంతృప్తికరమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ.. ఫెర్నాండెజ్ ఆసుపత్రి వర్గాలతో కలిసి పని చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ నూతన క్లినిక్ చిన్నారుల్లో మెల్లకన్ను, కంటి అలెర్జీ, ఇన్ఫెక్షన్లు, పుట్టుకతో వచ్చే కంటి శుక్లం, గ్లాకోమా, రెటీనా వంటి వ్యాధులు, సమస్యలను గుర్తించి వెంటనే చికిత్స అందించడానికి వీలవుతుందన్నారు.

పర్మనెంట్ కోసం సీఎంకు వినతి



సీఎంకు వినతి పత్రం అందచేసిన అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం సీఎం నివాసంలో యూటీఏసీ-టీఎస్ (యూనివర్సిటీస్ అసోసియేషన్ కాంట్రాక్టు-తెలంగాణ స్టేట్) ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.పరుశురాం పేర్కొన్నారు. ఉద్యోగాలను పర్మనెంట్ చేసే వరకు యూజీసీ 7వ వేతన సవరణ పీఆర్‌సీ అమలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 65 ఏళ్లకు పెంపు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని వినతిలో పేర్కొన్నట్లు డా.బాలకోటి, శ్రీశైలం, అంబాటి శ్రీనివాస్ పేర్కొన్నారు.

నిబంధనలు పాటించడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ సిబ్బందికి గురువారం 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. వాహనాలతో రోడ్ల మీదకు వచ్చామంటే విధి గా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. హెచ్ఆర్ ప్రసాద్, డాక్టర్ దీపక్, సెక్యూరిటీ ఆఫీసర్ త్రిపాఠి, కుమార్, స్వామి, గాయత్రి పాల్గొన్నారు.



మాత్రలు వేస్తున్న శ్రీలతాశోభన్‌రెడ్డి



మాత్రలను వేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

నులిపేద్దాం.. నివారిద్దాం

సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం : నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలలను కార్పొరేటర్లు, వైద్యాధికారులు, ఆశావర్కర్లు సందర్శించి విద్యార్థులకు మాత్రలు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..01-19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు.



మాత్రలు అందిస్తున్న కార్పొరేటర్ హేమ



మాత్రలు వేసిన కార్పొరేటర్ కె. హేమలత

నేడు చండీహోమం

సనత్‌నగర్: జ్యేష్ఠ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో దుర్గామాత ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు చండీహోమం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీదత్తాత్రేయ స్వామికి ఉదయం 6 గంటలకు అభిషేకం, 10 గంటలకు దత్తహోమం ఉంటుందన్నారు.

నియామకం



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకుడు పిట్ల నాగేశ్ ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా నియమితులవ్వగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజల సమస్యల గుర్తించి, పరిష్కారం కోసం కృషి చేయాల్సిందిగా ఆనంద్ గౌడ్ ఆయనకు సూచించారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

లాలాపేట: తార్నాక చౌరస్తాలో ఓ పెట్రోల్ బంక్ యాజమాన్యం ప్రధాన రహదారిని ఆక్రమించి లైటింగ్ పోల్ ఏర్పాటు చేస్తుండగా సమాచారం అందుకున్న నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఆక్రమణలు చేపట్టరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో ఇక్కడే రహదారిని ఆక్రమించి చెట్లను నాటగా మే 23న సికింద్రాబాద్ టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని తొలగించారు. మళ్లీ రోడ్డును ఆక్రమించే పనులు చేపడుతుండటంతో వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ శ్రేణులు గురువారం రాత్రి నగరానికి వచ్చిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు కవాడిగూడ ప్రధాన రహదారి సీజీఓ టవర్స్ వద్ద బీజేపీ నాయకులు స్వాగత వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదికపై నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌పై పువ్వుల వర్షం కురిపించి స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి, స్పందన, శ్రీనివాస్, సురేష్ కుమార్, కేఎం క్రిష్ణ, సత్యనారాయణ గౌడ్, కిరణ్, అరుణ్, పరమేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సనత్‌నగర్: కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నగరానికి విచ్చేసిన కిషన్‌రెడ్డికి బేగంపేట ఎయిర్‌పోర్ట్ బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. బేగంపేట నుంచి సీనియర్ నేత నెమలి ఆనంద్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



మధుమేహంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సనత్‌నగర్: భారతీయ యోగా సంస్థాన్ (బీవైఎస్) తెలంగాణ రాష్ట్ర (ఈస్ట్) డిస్ట్రిక్ట్-1 ఆధ్వర్యంలో సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కులో మధుమేహంపై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో సంస్థాన్ డిస్ట్రిక్-1 అధ్యక్షుడు వర్ధన్‌నాయక్, సెక్రటరీ యుగంధర్, విరించి జోన్ ప్రెసిడెంట్ కుసుమ హాజరై సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, ధ్యానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో తలెత్తే ఆరోగ్య రుగ్మతలను యోగ ద్వారా ఏ విధంగా అధిగమించవచ్చో తెలియజేయడమే కాకుండా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. మనం తీసుకునే ఆహారంలో 50-60 శాతం వరకు కార్బోహైడ్రేట్స్ లేదా షుగర్ ఉంటుందని, వీటి వల్లనే శరీరానికి ఎనర్జీ లభిస్తుందన్నారు. అయితే ఏదైనా కారణంతో ఇన్సులిన్ లోపం ఉంటే మన సెల్స్ గ్లూకోజ్‌ను గ్రహించుకోలేవని అన్నారు. గ్లూకోజ్ శరీరానికి సరిగ్గా అందకపోవడంతో శరీరం నీరస పడుతుందని, ఈ అవస్థనే డయాబెటిక్‌గా పేర్కొన్నారు. సరైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా డయాబెటిక్‌ను అదుపులో ఉంచుకోవచ్చన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్ఓ అనుదీప్

చిలకలగూడ : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, క్రిమినల్ యాక్టివిటీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిలకలగూడ ఎస్‌హెచ్ఓ అనుదీప్ హెచ్చరించారు. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో గురువారం రాత్రి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నగరంలో ఇటీవల హత్యలు, ఇతర నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. చిలకలగూడ ఠాణా పరిధిలో 65 మంది సస్పెక్ట్‌షీట్, 25 మంది రౌడీషీటర్లు నమోదై ఉన్నారని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఠాణా పరిధిలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎలెందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఆలేరు ఎమ్మెలే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కురమ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు డా.కంకల ఎలెందర్, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డా. రామ్ షెఫర్డ్ కోరారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 40 లక్షల జనాభా గల గొల్లకురుమలకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని లేకుంటే గొల్లకురుమల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో మహేందర్, కుమారస్వామి, అంజి, గోపాల్, బీసీ జేఏసీ, ఓయూ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

శంకర్ యాదవ్‌కు మంత్రుల నివాళి



ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ దశదిన ఖర్మలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొని నివాళులర్పించారు. -సాక్షి, సిటీబ్యూరో